

తెలంగాణ భవన్ వద్దకు వచ్చిన మూసీ బాధితుల గోడు వింటున్న హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి

తెలంగాణ భవన్‌లో తన కొడుకును ఒళ్లో కూర్చోబెట్టుకొని దీనంగా ఉన్న మహిళ



మాజీ మంత్రి మహమూద్ అలీకి తమ గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత ముస్లిం మహిళలు

మూసీలో పారేవి నీళ్లు కాదు.. ప్రజల రక్తం

మొదటిపేజీ తరువాయి...

చెందిన వందలాదిమంది శనివారం తెలంగాణ భవన్‌కు వచ్చారు. హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి వారి బాధలు విని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బుల్డోజర్ పాలన నడవదని దేశమంతా తిరుగుతూ చెప్తున్న రాహుల్‌గాంధీ తెలంగాణలో ఏం చెప్తారని ప్రశ్నించారు. మూసీపై ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ బాధితుల బాధ అనుభవించే వారికే తెలుస్తుందని, రేవంత్‌రెడ్డికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. సీఎం తన సోదరుడికి 45 రోజుల సమయం ఇచ్చి, పేదల ఇండ్లను మాత్రం రాత్రికి రాత్రే కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి చేస్తున్న గొప్ప పని సుందరీకరణ మాత్రమేనని చెప్పారు. ఏదైనా ఒక పని చేపడితే అది ఎంతోమందికి ఉపయోగకరంగా ఉండాలని పేర్కొన్నారు. కేసీఆర్ మిషన్ భగీరథ ప్రత్యక్షంగా ప్రజలకు ఉపయోగపడిందని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్షల ఎకరాలకు నీళ్లు అందాయని గుర్తుచేశారు. కానీ, రేవంత్‌రెడ్డి సుందరీకరణ పేరుతో వేల కుటుంబాల ఉసురు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

అనుమతులు ఇచ్చి కూల్చేస్తారా?

ఇండ్లు కట్టుకున్న వారికి రిజిస్ట్రేషన్ నుంచి విద్యుత్తు కనెక్షన్ వరకు అన్నింటికీ అనుమతులిచ్చి ఇప్పుడు కూల్చేస్తామంటే ఎలా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే వారికి అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు వాటిని కూలుస్తామనడం అన్యాయమని పేర్కొన్నారు. పేదలకు మేలుచేస్తే దీవెనలు ఇస్తారని, వారి ఉసురు తీస్తే శాపనార్థాలు పెడతారనే లాజిక్‌ను రేవంత్‌రెడ్డి మిస్సవుతున్నారని పేర్కొన్నారు. దేవుడు ఇచ్చిన అవకాశాన్ని మంచి పనికి ఉపయోగించాలని సూచించారు. ఈ మూర్ఖుడికి కూల్చడం తప్ప కట్టడం తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూల్చుడు, కేసులు, అక్రమాలు తప్ప పేదలకు పనికొచ్చే ఒక్క పని కూడా ఈ ప్రభుత్వం చేయడం లేదని పేర్కొన్నారు. తాను 2035 వరకు ఈఎంఐ కట్టాల్సి ఉన్నదని ఓ సోదరి చెప్పిందని, ఇల్లు కూలగొడితే ఈఎంఐ ఎలా కట్టాలని, కొత్త ఇంటి కిరాయి, పిల్లల ఫీజులు, ఖర్చులు.. మొత్తంగా ఆ కుటుంబం పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. రూపాయి, రూపాయి జమచేసి ఇల్లు కట్టుకుంటే రాత్రికి రాత్రే దానిని కూలగొడితే ఆ కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు.

అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచితంగా, తలాతోక లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు. నిజంగానే అభివృద్ధి చేయాలనుకుంటే అందుకు పేదల ఉసురు తీసుకోవాల్సిన పనిలేదని అన్నారు. మూసీపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ముందుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. పిల్లలకు కట్టించి ఇచ్చిన ఇండ్లు కూలగొడితే వారి పరిస్థితి ఏంటన్న బాధతోనే బుచ్చవ్వ ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. ఆమెది రేవంత్ చేసిన హత్య అని ఆరోపించారు.

> బుల్డోజర్ రాజ్ అంటూ హర్యానాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాహుల్‌గాంధీ తెలంగాణలో ఏం నడుస్తున్నదో తెలుసుకోవాలి. తెలంగాణలో నడుస్తున్నది కూడా బుల్డోజర్ రాజ్యమే. ఇక్కడి బుల్డోజర్లను ఆపకుండా మహారాష్ట్ర, ఝార్ఖండ్, హర్యానాలో బుల్డోజర్ రాజ్ నడవదంటే రాహుల్ మాటలను ప్రజలు ఎలా నమ్మాలి. - హరీశ్‌రావు

ఆరు గ్యారెంటీలు ఏవి?

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసిచ్చారని, ప్రభుత్వం తొలుత దానిపై దృష్టిసారించాలని హరీశ్‌రావు కోరారు. అసరా పింఛనును రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని చెప్పారని, మహిళలకు 2500, రైతులకు 7500, యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, వీటి అమలు సంగతి చూడాలని పేర్కొన్నారు. పేదల ఇండ్లను కూలగొట్టుడు ఎందుకు? బడా కంపెనీలకు ఇచ్చుడు ఎందుకని ప్రశ్నించారు. పేదల ప్రాణాలు తీసి కంపెనీలు కడతావా? రియల్ ఏస్టేట్ వ్యాపారం చేస్తావా? అని నిలదీశారు.

న్యాయ సహాయం అందిస్తాం

మూసీలో ఉండే పేదలు అక్కడే చిన్న చిన్న పనులు చేసుకొని బతుకుతారని, వారికి ఎక్కడో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామంటున్నారని మండిపడ్డారు. తుగ్లక్ పనుల వల్ల ఒక కుటుంబం మొత్తం జీవనాధారం కోల్పోతుందని, ఒకే రోజు వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు హైకోర్టు ద్వారా రక్షణ కల్పించేందుకు బీఆర్ఎస్ న్యాయవాదుల బృందం ఉంటుందని, మూసీ బాధితుల తరుపున న్యాయపరంగా పోరాటం చేస్తామని హామీఇచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం మూసీ బాధితుల ప్రాంతాల్లో పర్యటిస్తుందని, బాధితులకు భరోసా కల్పిస్తామని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు.

కేసీఆర్ అంటే ఒక భరోసా

బాధితులకు న్యాయపరంగా అందుబాటులో ఉంటామని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. పద్ధతిగా ఉన్నప్పుడు ప్రభుత్వమే ప్రజలపై దౌర్జన్యం చేస్తే చూస్తూ ఎలా ఊరుకుంటామని ప్రశ్నించారు. బాధితులు ఫోన్ చేస్తే బుల్డోజర్ల కేంటే మేమే ముందు వస్తామని చెప్పారు. హైదర్‌షాకోటలో గల్లీగల్లీ తనకు తెలుసని, బీఆర్ఎస్ హయాంలో అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. తమను ఆక్రమణదారులని అనడంతో బాధితులు బాధపడుతున్నారని పేర్కొన్నారు.

సుందరీకరణపేరిట విధ్వంసం: మహమూద్ అలీ

'మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం సృష్టిస్తున్నది. ఇష్టారీతిన పేదల ఇండ్లను కూల్చుతూ వారిని రోడ్డున పడేస్తున్నది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం' అని మాజీ డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ ధ్వజమెత్తారు. అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. హైడ్రా పేరిట డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

> మూసీ బాధితుల పక్షాన ఉంటాం. బాధితులు ధైర్యం కోల్పోవద్దు, ఎక్కువగా టెన్షన్ తీసుకోవద్దు, ఎప్పుడైనా మా తలుపులు తెరిచే ఉంటాయి. ఎప్పుడైనా రావచ్చు, బఫర్ జోన్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెట్టకుండా చూస్తాం. - హరీశ్‌రావు

పర్మిషన్ ఎందుకిచ్చారు?

మానాన్నది చిన్న కండక్టర్ ఉద్యోగం. మా మావయ్య రైల్వేలో చిన్న ఉద్యోగి. పైసాపైసా కూడబెట్టుకొని కార్పొరేషన్ నుంచి అన్ని అనుమతులు తీసుకొనే ఇల్లు కట్టుకున్నం. బ్యాంకు గూడా లోన్ మంజూరు చేసింది. ఇప్పుడు మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రాత్రికిరాత్రే కూల్చేస్తామంటే ఎట్ల. మా బతుకులు ఏమైపోతయ్. అభివృద్ధి అంటే కింది నుంచి పైకి వెళ్లాలి. మరి ప్రభుత్వం మమల్ని పై నుంచి కిందకు తోసేస్తున్నది. ప్రభుత్వం ఆలోచించాలి. మాకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ నాయకులకు పాదాభివందనాలు.

- శిరీష(గండిపేట)

> కేసీఆర్ హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచడంతో ఇక్కడికొచ్చి స్థిరపడితే పిల్లలు బాగుపడతారని ఎంతోమంది ఇక్కడికొచ్చి సెటిలయ్యారు. ఇప్పుడేమో ఎందుకొచ్చామా? అనే పరిస్థితికి రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి తుగ్లక్ నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ పరిస్థితి మసకబారుతున్నది. తమను దొంగల్లా, కబ్జాకోరుల్లా మాపెడుతున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. బాధిత కుటుంబాలకు మరక అంటించే ప్రయత్నం చేస్తున్నారు. -హరీశ్‌రావు

జీనతా గ్యారేజ్

"ఇక్కడ బాధితులకు భరోసా.. రక్షణ ఇవ్వబడును"

బరువెక్కిన గుండెలతో తెలంగాణ భవన్‌కు మూసీ, హైడ్రా కూల్చివేతల బాధితులు

పిల్లలతో ఉదయాన్నే తరలివచ్చిన కుటుంబాలు
బీఆర్ఎస్‌తోనే భరోసా దొరుకుతుందన్న నమ్మకం
గోడు వెళ్లబోసుకుంటూ కన్నీళ్లుపెట్టుకున్న మహిళలు
చలించిపోయి హరీశ్, సబిత కంటతడి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల ఆకాంక్షల ప్రతిరూప సౌధమది. అన్ని సందర్భాల్లో అభాగ్యులకు అండ అది. స్వరాష్ట్ర సమరంలో ఉద్యమకారులను గుండెల్లో దాచుకున్నట్టే ఇవ్వాళ మూసీ, హైడ్రా బాధితులకు తెలంగాణ భవన్ ఆలవాలమైంది. మొన్న రైతులు.. నిన్న ఉద్యోగార్థులు.. నేడు దయలేని కాంగ్రెస్ చేష్టలతో నిరాశ్రయులవుతున్న బడుగుజీవులకు గొడుగు పట్టింది. ఎండనకా..వాననకా నెత్తురు చెమటగ చేసి కట్టుకున్న 'గూడు'ను రాత్రికి రాత్రే సర్కారు నేలమట్టం చేస్తే నిరాశ్రయులు తమ కాళ్ల మీద తాము నిలబడే ధైర్యమైంది. గోడువినే నాథుడే లేక దీనంగా ఎదురుచూసే పేదలకు దారిచూపే దీపమైంది. తెలంగాణ భవన్ ఇప్పుడు జనతా గ్యారేజ్ అవతారమెత్తింది.

కటిక చీకటిలో.. గులాబీ వెలుగురేఖ

గొలుసుకట్టుగా సాగుతున్న కూల్చివేతలతో ఆవేదన, ఆందోళన నిండిన తనవులతో వంతుల వారీగా మూసీ పరీవాహక ప్రాంత జనం గస్తీ తిరుగుతున్నారు. కూల్చివేతల్లో సర్వం కోల్పోయిన బాధితులు దిక్కుతోచక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. గోడు వెళ్లబోసుకుందామన్నా సర్కారు చెవులు మూసుకున్నది. గూడు చెదిరిన గుండెలు బెంగటిల్లుతున్నాయి. ఇలాంటి కష్టకాలంలో బాధితులకు అండగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. '24/7 ఎప్పుడైనా సరే.. బాధితులెవరైనా సరే.. తెలంగాణ భవన్ తలుపు తట్టండి..మీకు అండగా మేము ఉంటాం' అని ప్రకటించింది. ఆ ప్రకటన కూల్చివేతల బాధితులకు కొండంత భరోసాఅయి శనివారం ఉదయం నుంచే తెలంగాణ భవన్ మూసీ బాధితుల కన్నీళ్లతో ఉద్విగ్నం కావటం మొదలైంది. పిల్లాజెల్లా, ముసలీముతకతో గుడ్ల నిండా నీళ్లతో కడుపునిండా దుఃఖంతో బాధితులు రావడం కనిపించింది. సర్కారు తమ బతుకులను ఎట్లా చిత్రవధ చేస్తున్నదో చెప్పుకొనేందుకు ఎవరికివారుగా వందల సంఖ్యలో తరలివచ్చారు. హైదర్‌షాకోట్, చాదర్‌ఘాట్, బండ్లగూడ తదితర ప్రాంతాల నుంచి తండోపతండాలుగా వచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతుండడంతో ఆయన మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డికి సమాచారం అందించారు. ఉన్నపళంగా వారు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు.

బాధితుల్లో ధైర్యం నింపిన మాజీ మంత్రులు

అప్పటికే ఉద్విగ్నంగా మారిన తెలంగాణ భవన్‌కు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి సహా పలువురు నేతలు చేరుకున్నారు. ఒక్కొక్కరి గాథలను ఓపిగ్గా విన్నారు. పేరుపేరునా.. కాలనీల వారీగా, బస్తీల వారీగా బాధితుల వేదనను నోట్ చేసుకున్నారు. పలు సందర్భాల్లో వారూ భావోద్వేగానికి లోనయ్యారు. బాధితులు కన్నీటి పర్యంతమవుతుంటే తట్టుకోలేకపోయారు. హరీశ్, సబిత కండ్లల్లోనూ నీళ్ల సుడులు తిరిగాయి. వారు మాట్లాడుతున్నప్పుడూ గద్గద స్వరంతో గొంతులు జీరబోయాయి. అన్నివిధాలా అండగా ఉంటామని అభయం ఇచ్చారు. అవసరమైతే బుల్డోజర్ ముందు తాము ఉంటామని ధైర్యం చెప్పారు.

నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పర్యటన

ఆదివారం ఉదయం మాజీ మంత్రి హరీశ్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకుల బృందం మూసీ ప్రభావ ప్రాంతం హైదర్‌షా కోట్‌లో పర్యటించనుంది. తెలంగాణ భవన్‌కు వచ్చిన వారికి భరోసా ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు, నేడు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించనున్నారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి వ్యథ..

ఒక్కొక్కరూ ఒక్కో కన్నీటిగాథై కదిలారు. 'నేను వేరే రాష్ట్రం అమ్మాయిని. కోడలిగా ఇక్కడి (హైదరాబాద్)కి వచ్చినప్పటి నుంచి ఇలాంటి దారుణాన్ని చూడలేదు. ఇప్పుడు నేనే ఆ బాధ అనుభవిస్తానని కలలోకూడా అనుకోలేదు.. మేం ఏం పాపం చేసినం? రెండేండ్లు కిరాయి ఉండి.. పైసా పైసా పోగేసి పదేండ్ల కింద పర్మిషన్ తీసుకునే ఇల్లుకట్టుకున్నం. పన్నులు కడుతున్నం. చెప్పాపెట్టకుండా వచ్చి కూలగొట్టారు. ఇప్పుడు ఎక్కడికి పోవాలి. మీ అత్తగారి ఊళ్లో బతకలేరా? అంటే మావాళ్లకు ఏమని సమాధానం చెప్పాలి?' అని ఒకరు.. 'మేం అభివృద్ధికి అడ్డం కాదు. అన్నీ డాక్యుమెంట్లు చూసే కట్టుకున్నం. బ్యాంకులోన్ తీసుకున్నం. సక్రమంగా లేకపోతే లోన్ ఇవ్వరు కదా?. 2035 దాకా ఈఎంఐలు కట్టాలి. పిల్లలు చిన్నవాళ్లు.. ఇప్పుడెక్కడికి పోవాలి?' అని ఒకరు. 'ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించారు. బఫర్‌జోన్‌లో కట్టుకున్నారు. ఆక్రమణదారులు.. ఇలా రకరకాల ట్యాగ్‌లు వేస్తున్నారు. ఇండ్లు కూల్చి రోడ్డుమీద పడేశారు. మమ్మల్ని చిత్రవధ చేస్తున్నారు' అని ఇంకొకరు ఇలా ఎవరిని కదిలించినా కన్నీటి ధారలే కురిశాయి.

కూల్చే హక్కు నీకెక్కడిది?

మూసీ పరీవాహక నివాసితుల నిలదీత

కాంగ్రెస్‌ను గద్దె దించుతామని హెచ్చరిక

రామంతాపూర్, సెప్టెంబర్ 28 : 'పైసా, పైసా కూడబెట్టుకొని ప్లాట్లు కొన్నం.. మా కాలనీలోకి ఎన్నడూ రాని మూసీ నీళ్లు ఇప్పుడెట్ల వస్తయ్? మేము కొన్న ప్లాట్లలో కట్టుకున్న ఇండ్లను కూల్చే హక్కు నీకెక్కడిది?.. నీకు ఓట్లేసి గెలిపించింది మా ఇండ్లు కూల్చేందుకా?' అంటూ రామంతపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్‌నగర్, బాలకృష్ణానగర్, సాబేరా కాలనీ, సాయికృష్ణానగర్ నివాసితులు రేవంత్‌రెడ్డి సర్కార్‌ను నిలదీస్తున్నారు. కేసీఆర్‌నగర్, మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇండ్లు కట్టుకున్నవారు కొన్నిరోజులుగా హైడ్రా చర్యలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎప్పుడు తమ ఇండ్లను కూల్చుతారోనని ఆందోళన చెందుతున్నారు. 'మా ప్రాణాలు పోయినా సరే.. ఇండ్లను కూల్చనివ్వం' అంటూ తెగేసి చెప్తున్నారు. ఐదు కాలనీలకు చెందినవాళ్లు శనివారం సమావేశానికి యూనిట్‌గా ఏర్పడి అందోళనలకు సిద్ధమైనట్టు ప్రకటించారు. కాంగ్రెస్‌ను గద్దె దించేవరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు. కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న నిర్మాణ దారులకు ఎలాంటి నోటీలు ఇవ్వలేదని ఉప్పల్ తహసీల్దార్ వాణీరెడ్డి తెలిపారు.

ఖర్చు మూడింతలెందుకు?

- **మూసీ సుందరీకరణ పేరిట వేలకోట్లు కొల్లగొట్టేందుకు యత్నం**
- **పాలమూరు - రంగారెడ్డి కన్నా సీఎంకు మూసీయే మక్కువా?: కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని పేర్కొనటం వెనుక భారీ బాగోతాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముందు రూ. 50వేల కోట్లు అని చెప్పి తరువాత ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని మూడింతలు పెంచటం ద్వారా కాంగ్రెస్ ధన దాహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. తట్టెడు మట్టి తీయకుండా వేల కోట్లు తన్నుకుపోయే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కుంభకోణాల కాంగ్రెస్ ఆటలు సాగనివ్వమని తేల్చిచెప్పారు.

మూసీతో మురిసె రైతులెందరు?

మూసీ సుందరీకరణ పేరుతో రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తే ఎంత మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగులోకి వచ్చే ఎకరాలెన్ని? నిల్వ ఉంచే టీఎంసీలెన్ని ? పెరిగే పంటల దిగుబడి ఎంత? తీర్చే పారిశ్రామిక అవసరాలెంత? కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లు ఎన్ని అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 80 వేల కోట్లయితేనే గల్లీ నుంచి ఢిల్లీ దాకా గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. లండన్‌లోని థేమ్స్‌లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏంటి ? గేమ్ ప్లాన్ ఏంటీ? అని కేటీఆర్ నిలదీశారు.

మూసీయే ముఖ్యమా?

ముఖ్యమంత్రికి కనీసం తను పుట్టిన గడ్డ మీద కూడా మమకారంలేదని కేటీఆర్ ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకన్నా మూసీ ప్రాజెక్టుపైనే ముఖ్యమంత్రి ఎందుకు ఎక్కువ మక్కువ చూపుతున్నారని ప్రశ్నించారు. చివరి దశలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కోల్డ్ స్టోరేజీలోకి నెట్టి మూసీ చుట్టే తిరగటం వెనుక దాగిన అంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వేల కోట్లను దోచుకునేందుకే మూసీ పేరుతో డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీ రివర్ ఫ్రంట్ పేరిట బ్యాక్ డోర్‌లో జరుగుతున్న బాగోతాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని చెప్పారు.

హైడ్రా భయంతోనే ముగ్గురి బలవన్మరణం

- **ఇల్లు కూలుస్తారనే బుచ్చమ్మ ఆత్మహత్య**
- **పేదలను పాట్టన పెట్టుకుంటున్న కాంగ్రెస్**
- **ముందే ప్రత్యామ్నాయం చూపాలి**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్**
- **గాంధీ దవాఖాన వద్ద బుచ్చమ్మకు నివాళి**

గాంధీ మార్చురీ వద్ద హరీశ్‌రావు, సబిత, కృష్ణారావును అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్: హైడ్రా భయాందోళనతో ఇప్పటి వరకు హైదరాబాద్ నగరంలో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా హెచ్చరికలతో కూకట్‌పల్లి యాదవ బస్తీలో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించేందుకు ఆయన ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాధవరం కృష్ణారావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి శనివారం గాంధీ దవాఖానకు వెళ్లారు. వారిని పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. మధ్యాహ్నం పోస్ట్‌మార్టం పూర్తయ్యాక బుచ్చమ్మ మృతదేహానికి నివాళ్లర్పించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను పొట్టన పెట్టుకుంటుందని ధ్వజమెత్తారు. పేదలపై కనికరం లేకుండా సొంతిండ్లను కూల్చివేస్తుండటంతో భయాందోళనతో గుండెలు ఆగిపోతున్నాయని తెలిపారు. హైడ్రా అధికారులు తమ ఇంటిని కూలుస్తారనే భయంతో కూకట్‌పల్లిలోని నల్లచెరువు వద్ద నివాసముండే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నదని తెలిపారు. పేదలపై విరుచుకుపడుతున్న రేవంత్‌రెడ్డి.. తన సోదరుడు, బడాబాబుల భవంతులను ఎందుకు కూల్చివేయలేదని ప్రశ్నించారు. పేదల ఇండ్లపైకి రాత్రికి రాత్రే బుల్డోజర్లను తీసుకొస్తున్నారని మండిపడ్డారు. పరిహారం ఇచ్చి, ప్రత్యామ్నాయం చూపాకే పేదల ఇండ్లను తొలగించాలని సూచించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని, జీవించి ఉండి పోరాడాలని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని, బ్రాండ్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందోళన వ్యక్తం చేశారు.నియోజకవర్గంలోని నిరుపేదలు శని, ఆదివారం వచ్చిందంటే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని తెలిపారు. కొద్దిసేపు ఓపీ బ్లాక్ ఎదురుగా ఉన్న మెడికల్ దుకాణాల వద్ద ఉన్న రోగులను హరీశ్ పలుకరించారు. డాక్టర్లు రాసిచ్చిన మందులలో రెండే దవాఖాన ఫార్మసీలో ఇచ్చారని, మిగతావి బయట కొంటున్నామని వారు తెలిపారు.

లోకం పోకడ



ఆ ఒక్క ఇల్లు ఎందుకు కూల్చలేదంటావా?
అది కాంగ్రెస్ నేతది లేవయ్యా?

గుండె తరుక్కుపోతున్నది

నేను చిన్నప్పటి నుంచి హైదరాబాద్‌లో ఉంటున్న. ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వడంతోనే ఇక్కడ ఇల్లు కట్టుకున్నం. అన్ని పేపర్లు కరెక్ట్‌గా ఉన్నాయనే బ్యాంకు లోన్ ఇచ్చింది. కానీ ప్రభుత్వం మమ్మల్ని ఆక్రమణ దారులంటూ ట్యాగ్‌లైన్ వేస్తున్నది. ఇప్పుడు ఇల్లు కూలగొడితే మా పరిస్థితేంటి? మా పిల్లలకు మేము ఏం చెప్పుకోవాలి. వాళ్ల చదువులు ఏంగావాలె? గవర్నమెంట్ ఆలోచించి మమ్మల్ని కాపాడాలె. - సిరిమా (హైదర్‌షాకోట)

శివారులో డెవలప్ చేయాలె

మేం చట్టబద్ధంగా బండ్ల గూడలో ఇల్లు కట్టుకున్నం. కానీ ఇప్పుడు మమ్మల్ని మూసీ ఆక్రమణదారులని ప్రభుత్వం ముద్రవేస్తున్నది. నిజంగా ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే నగర శివారు ప్రాంతంలో డెవలప్ చేయాలె. వికారాబాద్ దగ్గర కృష్ణా నది వద్ద బ్యూటిఫికేషన్ చేపట్టాలె. గుజరాత్‌లోకూడా ఇట్లనే జేసిన్రు. కానీ ఇక్కడి ప్రభుత్వం హైదరాబాద్ మధ్యలోని జనావాసా ప్రాంతాల్లో మూసీ బ్యూటిఫికేషన్ పేరిట ఆగం చేస్తున్నది. - మహ్మద్ అయూబ్, హైదర్‌షాకోట (బండ్లగూడ)

కేసీఆర్ పాలనే మంచిగున్నది

మేం మూడు, నాలుగు నెలలుగా భయభ్రాంతులకు గురవుతున్నం. ఈ ప్రభుత్వం మా ఇంటిని కూలగొడతామని భయపెడుతున్నది. కేసీఆర్ పదేండ్ల పాలనలో గిట్ల లేకుండే. ఆయన అందరికీ మంచి జేసిండు. కానీ ఈ ప్రభుత్వం నిర్మించడం బంద్‌పెట్టి హైడ్రా తెచ్చి కూల్చివేతలు మొదలు పెట్టింది. ఎక్కడో లండన్‌లోని థేమ్స్ నదిలెక్క మూసీని చేస్తామని చెబుతున్నది. అక్కడున్న జనాభా ఎంత? ఇక్కడ ఉన్న జనాభా ఎంత? ఇవేవీ పరిగణలోకి తీసుకోకుండా దుర్మార్గంగా ముందుకెళ్తున్నది. - రాజు, హైదర్‌షాకోట

రక్షించాల్సిన వారే భక్షిస్తున్నరు

మా అమ్మానాన్న అష్టకష్టాలు పడి ఇక్కడ ఇల్లు కట్టారు. ఇప్పుడు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా తెచ్చి ప్రజలను ఆగం జేస్తున్నడు. రాత్రికిరాత్రే ఇండ్లను కూల్చివేస్తూ పేద, మధ్యతరగతివాళ్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నడు. ఆరు గ్యారెంటీలను ఇవ్వకుండా తప్పుదోవపట్టిస్తున్నడు. అంటే ప్రజలను రక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలే భక్షిస్తున్నరు. బీఆర్ఎస్ నాయకులు మాకు అండగా నిలువాలె. - తేజస్వి, దత్తాత్రేయకాలనీ(సన్‌సిటీ)

అప్ప చేసి ఇల్లుకట్టుకున్నం

మేం 27 ఏండ్లుగా ఇక్కడ ఉంటున్నం. పైసా పైసా జమ చేసి, కొంత బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి ఇల్లు కట్టుకున్నం. మొన్ననే మా భర్త ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయిండు. ఇగ సంతోషంగా ఉందామనుకున్న టైంలో ప్రభుత్వం ఇలా జేస్తే ఎలా? ఏండ్ల కింద కట్టుకున్న ఇండ్లను కూలగొడుతే మా బతుకులు ఏంగావాలె? గిట్లజేస్తే హైదరాబాద్ అభివృద్ధి జరుగుతదా?.. ఇప్పుడన్న జెర ఆలోచించాలె. -సరస్వతి(గండిపేట)

మీ అన్నకు ఓ రూలు..మాకో రూలా?

మేం ఎస్‌బీఐ, ఎల్ఐసీ లాంటి జాతీ